# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

మంగళవారం | 24 జూన్ 2025 | పేజీలు 8


## నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా సంబరాలు..

### సాయంత్రం 6 గంటలకు సచివాలయం ముందు రైతు నేస్తం సభ..



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి వర్గ విస్తరణ తర్వాత ఏర్పాటు చేసిన తొలి కేబినెట్ సమావేశం ముగిసింది. సీఎం రేవంత్ అధ్యక్షతన జూన్ 23న జరిగిన ఈ సమావే శంలో పలు కీలక నిర్ణయాలు తీసుకు న్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా సంబరాలు నిర్వహించాలని నిర్ణయించారు. నేడు(మంగళవారం, జూన్ 24) అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ విషయాన్ని సమావేశం

-3 లో

# పెరోల్‌పై వచ్చిన జీవిత ఖైదీ...
# మరో రెండు నేరాలు

### దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో డిసిపి ప్రెస్‌మీట్..



దొంగతనం కేసులో డిసిపి కోటిరెడ్డి ప్రెస్‌మీట్..



దొంగతనం కేసులో రికవరీ చేసిన బైక్, ట్రాక్టర్..


**దుండిగల్, పెన్ పవర్, జూన్ 23:** కన్న తండ్రిని హత్యచేసిన కేసులో జీవిత ఖైదిగా శిక్షను అనుభవిస్తూ.. సత్ప్రవర్తన కలిగి పెరోల్‌పై బయటకు వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు.. మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి పత్రికా సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుండిగల్ పియస్ పరిధిలో ట్రాక్టర్ దొంగలించారన్న పిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.. మెదక్ జిల్లాకు చెందిన గొండ్ల రాములు (42) 2016లో తండ్రిని హత్యచేసిన కేసులో జైలుకు వెళ్లిన అతను ( సత్ప్రవర్తన) పెరోల్ పై బయటికి వచ్చి బౌరం పేట్‌లో ఉన్న భార్య ఇంటి దగ్గర ఉంటున్న ఇతనే బైక్, ట్రాక్టర్ వాహనాలను దొంగలించాడని పోలీసులు తేల్చారు.. నిందితున్ని అరెస్టు చేసిన దుండిగల్ పోలీసులు అతని వద్ద నుండి ఒక ట్రాక్టర్, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.. కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్‌కి తరలిస్తున్నట్లు మీడియా సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.. ఇప్పటికే జీవితఖైదీగా ఉన్న నిందితునికి మళ్ళీ పెరోల్ రాకుండా కేసు నమోదు చేస్తున్నట్లు డిసిపి కోటిరెడ్డి తెలిపారు..

## జూమ్ కారులో 120 కేజీల..
# గంజాయి రవాణా..

### దుండిగల్ ఎగ్జిట్-5 దగ్గర పోలీసులకు పట్టుబడిన నిందితుడు..

- వైజాగ్ నుండి హైదరాబాద్ మీదుగా హర్యానాకు తరలిస్తున్న ముఠా..
- దుండిగల్ పోలీసులు, మేడ్చల్ ఎస్‌వోటి పోలీసుల జాయింట్ ఆపరేషన్..
- ఎగ్జిట్-5 దగ్గర అదుపులో సాగర్ పవార్.. పరారీలో మరో నలుగురు..
- దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డి.సి.పి కోటిరెడ్డి విలేఖరుల సమావేశం..

-2 లో



గంజాయి పట్టుబడిన నెక్సా కారును విలేఖరుల సమావేశంలో..

## నిజాంపేట్ కార్పోరేషన్‌లో..!
# మొక్కుబడిగా ప్రజావాణి..

### అధికారులు లేని ప్రజావాణి నిర్వహణపై అనేక విమర్శలు..

- సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమానికి అధికారుల గైర్హాజర్..
- అర్జీలు తీసుకునే అధికారుల స్థానంలో వార్డ్ ఆఫీసర్‌తో దరఖాస్తుల స్వీకరణ..
- ఇన్‌వార్డ్‌ను తలపించే విధంగా ఫిర్యాదులు తీసుకొని స్టాంపేసి ఇవ్వడం గమనార్హం..
- ఆరుబైట చైర్లువేసి, సరికొత్తగా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణలో నిజాంపేట్..

-3 లో



# మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావాణిలో.. 117 దరఖాస్తులు..

- జాప్యం చేయకుండా సత్వర పరిష్కారం చూపాలి: అడిషనల్ కలెక్టర్..
- ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశం..
- దరఖాస్తుల తిరస్కరణపై వివరణ ఇవ్వాలన్న అదనపు కలెక్టర్..

-4లో






# జూమ్ కారులో 120 కేజీల... గంజాయి రవాణా

## దుండిగల్ ఎగ్జిట్-5 దగ్గర పోలీసులకు పట్టుబడిన నిందితుడు..




గంజాయి పట్టుబడిన నెక్సా కారును విలేఖరుల సమావేశంలో..

గత రెండేళ్ళుగా పలుమార్లు వైజాగ్ కేంద్రంగా, హైదరాబాద్, గంజాయి రవాణా చేస్తూ, పట్టుబడిన ఘటనలు ఉన్నాయి.. గతంలో పేట్ బషీరాబాద్, దుండిగల్, షామీర్‌పేట్, పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలోనూ గంజాయి భారీ మొత్తంలో పోలీసులకు పట్టుబడిన నిందితులు కటకటాల పాలయ్యారు.. గంజాయి రవాణా నిందితులు,ఒక్కోసారి ఒక్కో వధంగా భిన్న మార్గాలను ఎంచుకొని, తప్పించుకునే ప్రయత్నంలో, పోలీసుల చేతిలో విఫలం అవుతూన్నారు.. ఆంధ్రప్రదేశ్ నుండి పోలీసులు గంజాయి తరలించిన ఘటనలను సైతం తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.. తాజాగా జూమ్ కార్‌లో ప్రొఫెషనల్ స్థాయిలో వాహనాల మార్పిడితో గంజాయి, తరలించే విషయాన్ని, విశ్వసనీయ సమాచారంతో,పసిగట్టిన దుండిగల్ పోలీసులు, మేడ్చల్ ఎస్‌వోటి పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో 120 కేజీల గంజాయిని పట్టుకున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 23..

దుండిగల్ పి.యస్ పరిధిలోని రింగ్‌రోడ్డు ఎగ్జిట్-5 వద్ద గంజాయిని తరలిస్తున్న కారును, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు.. డిసిపి తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ వైజాగ్ నుండి హైదరాబాద్ మీదుగా హర్యానా రాష్ట్రానికి, కారులో గంజాయి తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో..! మేడ్చల్ ఎస్‌వోటి పోలీసులు, దుండిగల్ పోలీసులు, మాటువేసి పట్టుకున్నారు.. దుండిగల్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్-5 వద్ద నెక్సా కారులో తరలిస్తున్న 120 కేజీల గంజాయితో పాటు, నిందితుడు సాగర్ పవార్ (23) పోలీసులు అరెస్ట్ చేశారు.. మరో నలుగురు పరారీలో ఉన్నట్టు డిసిపి కోటిరెడ్డి తెలిపారు.. స్వాధీనం చేసుకున్న గంజాయి 120.17 కేజీలు, ఒక నెక్సా కారు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.. వీటి విలువ దాదాపు 40 లక్షల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు..




కారులో పట్టుబడిన 120 కేజీల గంజాయి..

- వైజాగ్ నుండి హైదరాబాద్ మీదుగా హర్యానాకు తరలిస్తున్న ముఠా..
- దుండిగల్ పోలీసులు, మేడ్చల్ ఎస్‌వోటి పోలీసుల జాయింట్ ఆపరేషన్..
- ఎగ్జిట్-5 దగ్గర అదుపులో సాగర్ పవార్.. పరారీలో మరో నలుగురు..
- దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డి.సి.పి కోటిరెడ్డి విలేఖరుల సమావేశం..

### గంజాయి రవాణాకు.. జూమ్ కార్..

గంజాయి నిందితులు ఒక్కోసారి ఒక్కో రవాణా మార్గాన్ని ఎంచుకోవడం గమనార్హం.. ఈ గంజాయి రవాణాలో తమకార్లను పోలీసులు గుర్తిస్తారనే ఆలోచనతో.. రూట్ మార్చారు.. జూమ్ కారును (సెల్ఫ్ డ్రైవింగ్) ఆన్‌లైన్‌లో అద్దెకు తీసుకొని గంజాయి రవాణా చేస్తున్నారు.. సినీ పక్కీలో అక్కడక్కడ, వాహనాల మార్పిడితో ఈ గంజాయి రవాణా ప్లాన్ చేసినట్టు విచారణలో తేలింది.. దేవరాజ్ అనే వ్యక్తి నుండి గంజాయిని సప్లై చేసాడని దానిని కిరాయి కారులో, బజరంగ్‌కు అందచేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు.. ఎక్జాది నుండి హనుమంత్ పవార్, రాజకుమార్‌కు సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు విచారతో గుర్తించారు.. ప్రధాన నిందితుడు సాగర్ పవారును అరెస్టు చేసిన పోలీసులు మరో నలుగురి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు.. మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి, దుండిగల్ సిఐ సతీష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌ను, మేడ్చల్ ఎస్‌వోటి, దుండిగల్ పోలీసులను డిసిపి కోటిరెడ్డి ప్రశంసించారు..



దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో, గంజాయి ప్రెస్‌మీట్‌లో డిసిపి కోటిరెడ్డి, ఏసిపి శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీష్,

- సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమానికి అధికారుల గైర్హాజర్..
- అర్జీలు తీసుకునే అధికారుల స్థానంలో వార్డ్ ఆఫీసర్‌తో దరఖాస్తుల స్వీకరణ..
- ఇన్‌వార్డ్‌ను తలపించే విధంగా ఫిర్యాదులు తీసుకొని స్టాంపేసి ఇవ్వడం గమనార్హం..
- ఆరుబైట చైర్లువేసి, సరికొత్తగా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణలో నిజాంపేట్..



నిజాంపేట్ కార్పోరేషన్‌లో ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వార్డు ఆఫీసర్..

# నిజాంపేట్ కార్పోరేషన్‌లో..! మొక్కుబడిగా ప్రజావాణి..

## అధికారలు లేని ప్రజావాణి నిర్వహణపై అనేక విమర్శలు..



**దుండిగల్, పెన్ పవర్, జూన్ 23:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై సత్వర పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన, వారం వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం, ఆ కార్పోరేషన్‌లో విమర్శల పాలైంది..ఆరుబయట చైర్లువేసి వార్డు ఆఫీసర్‌తో, ప్రజల అర్జీలు స్వీకరించి, ఇన్‌వార్డ్‌ను తలపించే విధంగా స్టాంపు వేసి ఇవ్వడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటం సాగించే ఆకుల సతీష్ నిజాంపేట్ కార్పోరేషన్ ప్రజావాణి కార్యక్రమంపై తీవ్రంగా విమర్శించారు..

నిజాంపేట్ కార్పోరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు.. ప్రజావాణి అంటే మున్సిపల్ కమిషనర్‌తో పాటు, వివిధ విభాగాలకు చెందిన అధికారుల సమక్షంలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించి, వెంటనే పరిష్కరించే విధంగా నిర్వహించాల్సిన కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని సతీష్ పేర్కొన్నారు.. ఒక వార్డ్ ఆఫీసర్‌తో ఆరు బయట చైర్లు వేసి, వచ్చిన ఫిర్యాదులు తీసుకొని స్టాంపేసి ఇవ్వడం ఇది ప్రజావాణి అంటారా,దీనికి నిజాంపేట్ కమిషనర్ సమాధానం చెప్పాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. ఇప్పటికైనా అన్ని విభాగాల అధికారులతో కార్పోరేషన్ హాల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజా సమస్యల ఫిర్యాదుల్ని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని, ఆకుల సతీష్ ఉన్నతాధికారులను కోరారు.

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా సంబరాలు..

- మొదటి పేజి తరువాయి

అనంతరం మంత్రి పొంగులేటి తెలిపారు. కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వేసినందుకు రైతు భరోసా సంబరాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అన్ని మండల కేంద్రాలలో సంబరాలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. అదే విధంగా సాయంత్రం 6 గంటలకు సెక్రటేరియట్ ముందు 'రైతు నేస్తం' సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక తెలంగాణ తల్లి విగ్రహాలను అన్ని కలెక్టరేట్ల ముందు ఏర్పాటు చేయాలని కేబినెట్ ఆమోదించింది. కొత్త నమూనా విగ్రహాలను అన్ని కలెక్టరేట్ల ముందు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం పదేండ్ల పాలించిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయలేక పోయిందని.. కానీ తమ ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కర్యాలయాల ముందు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

## ఇంకో 15 నుంచి 20 ఏళ్ళు కూటమి ప్రభుత్వమే ఉంటుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తైన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించింది ప్రభుత్వం. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. మళ్ళీ వైసీపీ ప్రభుత్వం రాదు, రాబోదని.. 2029లో రాబోయేది కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ఇంకో 15 నుంచి 20 ఏళు ్ళ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నది వికసిత భారత్ కోసమేనని అన్నారు పవన్ కళ్యాణ్. రోడ్ల మీదకు వచ్చి బ్యానర్లు పట్టుకుని గొంతులు కోస్తామంటూ సినిమా డైలాగులు చెప్తే మక్కెలు విరగ్గొట్టి కూర్చుబెడతామని అన్నారు.. తాము సరదాగా లేమని, చాలా దెబ్బలు తిని ఇక్కడికి వచ్చామన్నారు పవన్ కళ్యాణ్.జగన్ నియంతృత్వ ధోరణి ఇంకా మారలేదని.. ప్రజాస్వామ్య విధానాలపై వైసీపీకి నమ్మకం లేదని అన్నారు పవన్ కళ్యాణ్. విదేశాల్లో ఉన్నా వెంటాడతామంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు చాలా ఇబ్బందిగా ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి అసాంఘిక చర్యల్ని అస్సలు సహించబోదని.. గొంతులు కోస్తామంటూ హెచ్చరిస్తే భయపడమని అన్నారు పవన్. ఇవన్నీ చూసే ఇక్కడికి వచ్చామని పిచ్చి బెదిరింపులు చేయొద్దని అన్నారు పవన్.ఆంధ్రప్రదేశ్ బాగు కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నామని.. గత ఐదేళ్ల విధ్వంసకర పాలన జరిగిందని అన్నారు. సీఎం చంద్రబాబును గత పాలకులు ఎంతగానో ఇబ్బంది పెట్టారని.. అధికారులు కూడా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు పవన్. విశాఖలో తనను కూడా అడ్డుకున్నారని.. ఇలాంటి పరిస్థితిలో మళ్ళీ సాధారణ రోజులు వస్తాయా అని అనిపించేదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు అప్పట్లో విలవిలలాడిపోయారని.. అందుకే సుపరిపాలన కోసం తాము కూటమిగా ఏర్పడ్డామని అన్నారు పవన్ కళ్యాణ్.



విజయేందర్ రెడ్డి.. మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, డిఆర్వో హరిప్రియ.

# మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావాణిలో... 117 దరఖాస్తులు

- జాప్యం చేయకుండా సత్వర పరిష్కారం చూపాలి: అడిషనల్ కలెక్టర్..
- ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశం..
- దరఖాస్తుల తిరస్కరణపై వివరణ ఇవ్వాలన్న అదనపు కలెక్టర్..



మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 23: ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారలకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి, తక్షణ పరిష్కారం చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ హరిప్రియతో కలిసి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి (117) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చుకొని సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు అధికారులని సంప్రదిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టర్ అన్నారు. అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# కామారెడ్డిలో రేవంత్ రెడ్డి ఎందుకు ఓడిపోయారంటే: కాంగ్రెస్ నేత సంచలన ఆరోపణ

- కామారెడ్డిలో రేవంత్ రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమని హర్షవర్ధన్ రెడ్డి ఆరోపణ
- గత ప్రభుత్వం తమ ఫోన్లు ట్యాప్ చేసిందని కాంగ్రెస్ నేత వాంగ్మూలం
- ఎన్నికల సమయంలో తన ఫోన్ 16 రోజులు ట్యాప్ చేశారన్న హర్షవర్ధన్ రెడ్డి
- టెలిగ్రఫీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సోమవారం సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ పెద్దలు తమ ఫోన్లను ట్యాప్ చేసి, తాము ఎవరితో సంభాషిస్తున్నామో, ఎలాంటి వ్యూహాలు రచిస్తున్నామో తెలుసుకున్నారని ఆరోపించారు.

2023 శాసనసభ ఎన్నికల సమయంలో తాను కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించినట్లు హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమ వ్యూహాలను పసిగట్టడం వల్లే రేవంత్ రెడ్డి అక్కడ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో పోలీసులు అడుగడుగునా తమ వాహనాలను ఆపి తనిఖీలు చేసేవారని, అనేక ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు పద్ధతులను అవలంబించి, గత ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిందని ఆయన ఆరోపించారు. కామారెడ్డిలో ఉన్నప్పుడు తన ఫోన్‌ను 16 రోజుల పాటు ట్యాప్ చేశారని హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మఫ్టీలో ఉన్న పోలీసులు తమను నిరంతరం అనుసరించారని, తమ ఎన్నికల వ్యూహాలను పూర్తిగా తెలుసుకున్నారని తెలిపారు. కేంద్ర స్థాయి సంస్థలు చేపట్టాల్సిన ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియను, తమను ఉగ్రవాదులుగా చిత్రీకరించి స్థానిక

పోలీసులతో చేయించారని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులతో పాటు, వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులను కూడా వదల్లేదని ఆయన ఆరోపించారు. టెలిగ్రాఫ్ చట్టం కింద ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులను కోరినట్లు హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు.

# యతి ప్రాసలతో పవన్ కల్యాణ్ పై రోజా పంచులు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఈ రోజు ఏపీలో నిరుద్యోగ సమస్యలపై 'యువత పోరుబాట' కార్యక్రమానికి వైసీపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులు నిరసన చేపడుతున్నారు. ఈ సందర్భంగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగాలు లేకపోతే నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి హామీలను ఎందుకు అమలు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా యువతకు ఇచ్చిన హామీలను తక్షణం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ.. కలెక్టర్ లకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా స్పందించిన రోజా... పవన్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు.

అవును... ఏపీలో యువత పోరుబాట కార్యక్రమానికి వైసీపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రో%యిుఖు%... కూటమి ప్రభుత్వ పెద్దలు, డిప్యూటీ సీఎం పవన్ పైనా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గబ్బర్ సింగ్ లా హామీల మాటలు చెప్పిన పవన్ ఇప్పుడు రబ్బర్ లా మారాడని అన్నారు.

ఇదే సమయంలో.. సినిమాల్లో పవర్ స్టార్ గా ఉన్న పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చి యువత చెవుల్లో ఫ్లవర్ లు పెడుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన హామీలను.. అధికారంలోకి వచ్చాక మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వకుండా వాళ్లు మాత్రం జాబ్ లు తెచ్చుకున్నారని మండిపడ్డారు.

ఇందులో భాగంగా... పవన్ కల్యాణ్ తనకు డిప్యూటీ సీఎం జాబ్ తెచ్చుకున్నారని, తన అన్న నాగబాబుకు ఎమ్మెల్సీ జాబ్ ఇప్పించుకున్నారని.. అయితే, ఎన్నికల్లో వాళ్ల మాటలు నమ్మి ఓటు వేసిన యువతను మాత్రం పట్టించుకోవడం లేదని రోజా ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేష్ ఏమయ్యారని

ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా... కూటమి ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత ఒక్కరికి కూడా ఈరోజు ఉద్యోగం ఇవ్వలేదని అన్నారు. ఈ రాష్ట్రంలో కోటి అరవై లక్షలు ఇల్లు ఉన్నాయని, ఆ నిరుద్యోగుల పరిస్థితి ఏంటని మాజీ మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబు మొదటి సంతకం చేసిన డీఎస్సీలో ఇప్పటివరకు ఒక టీచర్ కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు.

# 'ఫ్లైట్ నడపడానికి పనికిరావు.. వెళ్లి చెప్పులు కుట్టుకో'.. ఏమిటీ ఘోరం?

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోతోందని.. ప్రపంచంలోనే మూడో బలమైన ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని.. మన నేతలు ప్రసంగాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. ఇటీవల కాలంలో చాలా మందిలో పాతుకుపోయిన కుల, మత పరమైన జాడ్యాలు కూడా పెరుగుతున్నాయి. ఈ దరిద్రాన్ని భారత్ నుంచి ఈ శతాబ్ధంలోనూ దూరం చేయకున్నాయి!

ఈ క్రమంలో ఇలాంటి కులం పేరు చెప్పి ఓ మనిషిని ట్రీట్ చేయడం, దూషించడం వంటి పైత్యాలకు సంబంధించిన ఘటనలు పలు వెలుగుచూస్తున్నాయి. ఇందులో రాజకీయాలు, ఉద్యోగాలు, ట్రైనింగ్ సెంటర్లు అనే తారతమ్యాలేవీ లేవు.. అన్ని చోట్లా ఈ రోగం ఉంది! ఈ క్రమంలో ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కుల వివక్ష ఘటన కలకలం రేపింది. అవును... ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో కుల వివక్ష ఘటన కలకలం రేపింది. ఇందులో భాగంగా... తనను ముగ్గురు ఇండిగో సీనియర్ అధికారులు కులం పేరుతో దూషించారని దళిత సామాజికవర్గానికి చెందిన ఓ శిక్షణ పైలట్ ఆరోపించారు. తన గుర్తింపును కించపరిచే లక్ష్యంతోనే అవమానించారని ఆయన చెప్పారు. గురుగ్రాంలోని ఇండిగో ప్రధాన కార్యాలయంలో ఓ మీటింగ్ కు వెళ్లగా.. అక్కడ కెప్టెన్ రాహుల్ పాటిల్ సహా మరో ఇద్దరు సీనియర్లు తనపై మండిపడ్డారని శిక్షణ పైలట్ వెల్లడించారు. ఇందులో భాగంగా... "నువ్వు ఫ్లైట్ నడపడానికి పనికిరావు.. వెళ్లి చెప్పులు కుట్టుకో.. ఇక్కడ వాచ్ మెన్ గా కూడా పనికిరావు" అని దూషించారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా స్పందించిన బాధితుని తండ్రి... ఈ విషయాన్ని ఇండిగో ఎయిర్ లైన్స్ సీఈఓ, ఎథిక్స్ కమిటీకి నివేదించినప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ అన్యాయాన్ని పరిష్కరించడానికి, తన కుమారుడి గౌరవం, హక్కులను కాపాడటానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. దీంతో.. ఈ విషయం ఒకసారిగా షాకింగ్ గా మారింది. మరోవైపు బాధితుని ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు జీరో ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి గురుగ్రాంకు కేసు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో... గురుగ్రాం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు దర్యాప్తు చేపట్టారు.

# పశ్చిమాసియాలో పరిస్థితులపై కిమ్ రాజ్యం కీలక వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. దీంతో.. పశ్చిమాసియాలో పరిస్థితులు రోజురోజుకీ ఉధృతంగా మారుతున్నాయి. సరిగ్గా ఈ సమయంలో ఈ యుద్ధంలోకి అమెరికా నేరుగా అడుగుపెట్టింది. ఇరాన్ లోని అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అగ్రరాజ్యం విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో కిమ్ రాజ్యం ఉత్తర కొరియా స్పందించింది. అవును... ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధంతోనే పశ్చిమాసియా రగిలిపోతుంటే.. ఆ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ ఇచ్చి ఆ మంటల్లో పెట్రోల్ పోసినంత పనిచేసిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఫలితంగా.. పశ్చిమాసియాలో మొదలైన యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం లేకపోలేదనే ఆందోళనలను ప్రపంచ దేశాల నుంచి వెలువడుతున్నాయి. ఇలా ఇరాన్ పై అమెరికా దాడులు చేయడంపై ఉత్తరకొరియా స్పందించింది. ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. పశ్చిమాసియాలో తాజా ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయెల్ కారణమని మండిపడింది. ఈ దాడులు ఒక సార్వభౌమ దేశ భద్రతా ప్రయోజనాలను, ప్రాదేశిక హక్కులను ఉల్లంఘించడమేనని ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఈ సందర్భంగా స్పందించిన ఉత్తర కొరియా విదేశాంగ శాఖ.. ఇరాన్ భూభాగంపై అమెరికా దాడులను ఉత్తర కొరియా తప్పుబడుతోందని.. అమెరికా, ఇజ్రాయెల్ ఘర్షణాత్మక చర్యలను అంతర్జాతీయ సమాజం కూడా గట్టిగా ఖండించాలని పిలుపునిచ్చింది. నిరంతర యుద్ధ ఎత్తుగడలు, ప్రాదేశిక విస్తరణను పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని మండిపడింది. కాగా... ఇరాన్, ఉత్తర కొరియా మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా... బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేయడం విషయంలో ఈ ఇరుదేశాల మధ్య దశాబ్దాలుగా సైనిక సహకారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే.. ఇరాన్ వద్ద ఇప్పటికే సుమారు 2000 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. సుమారు మూడు రోజుల ముందు కూడా ఇజ్రాయెల్ పై ఉత్తరకొరియా తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... అమెరి కా, పాశ్చాత్య దేశాల అండదండలతో ఉన్న ఇజ్రాయెల్.. పశ్చిమాసియాలో శాంతికి కేన్సర్ లాంటిదని, ప్రపంచ శాంతి భద్రతలను నాశనం చేయడంలో ప్రధాన దోషి అని సంచలన ఆరోపణలు చేసింది.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపై చేతులెత్తేసిన రష్యా.. ఇరాన్ ఆశలపై నీళ్లు చల్లినట్లేనా..?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఒక దేశంపై మరో దేశం మిస్సైళ్లు, బాంబులతో దాడులు చేసుకుంటున్నాయి. ఇది చాలదు అన్నట్లు యుద్ధంలోకి అమెరికా ఎంటరవ్వటం.. ఇరాన్ న్యూక్లియర్ సైట్లపై భారీ బాంబులతో దాడులు చేయటం జరిగిపోయాయి. ఇదే అదునుగా ఇజ్రాయెల్ మరింత దూకుడుగా ఇరాన్ పై రెచ్చిపోయి దాడి చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ తమ మిత్ర దేశం రష్యా సహకారం కోసం ఎదురుచూస్తోంది. ఇలాంటి కీలక సమయంలో రష్యా ఆల్మోస్ట్ చేతులెత్తేసినంత పని చేసి ఇరాన్ ఆశలపై నీళ్లు చల్లింది.

మిత్ర దేశమైన ఇరాన్ కు మద్ధతు ఇవ్వడంలేదని.. ఎందుకు ఇజ్రాయెల్ పై యుద్ధం చేయడం లేదని సోమవారం (జూన్ 23) మీడియా అడిగిన ప్రశ్నలకు.. రష్యా అధ్యక్షుడు చెప్పిన సమాధానంతో ఇరాన్ ఒకింత ఆశ్చర్యానికి గురైందని చెప్పవచ్చు. అటు అమెరికా డైరెక్ట్ గా రంగంలోకి దిగి యుద్ధం చేస్తుంటే.. రష్యా ఎందుకు దూరంగా ఉంటుందని ఇప్పటికే అంతర్జాతీయంగా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పుతిన్ క్లారిటీ ఇచ్చారు.ఇరాన్ కు ఎప్పటికీ తమ మద్ధతు ఉంటుందని.. దశాబ్దాల కాలంగా ఇరాన్ తమకు మిత్ర దేశంగా ఉందని తెలిపారు. అయితే ఇజ్రాయెల్ విషయంలో న్యూట్రల్ గా ఉండటానికి కారణం.. ఆ దేశంలో 20 శాతం మంది రష్యా మాట్లాడేవారు ఉన్నారని చెప్పారు. ఇజ్రాయెల్ తో సాంస్కృతి సంబంధాలు ఉన్నాయని.. దాదాపు 20 లక్షల ప్రజలు రష్యన్ భాష మాట్లాడతారని తెలిపారు. అంటే అది దాదాపు రష్యా దేశంగా మారిపోయిందని అన్నారు. అందుకే రష్యా విదేశాంగ విధానంలో ఈ అంశాలు కీలకంగా మారాయని చెప్పారు పుతిన్. ఈ వ్యాఖ్యలు ఇరాన్ ను కాస్త నిరాశపర్చాయనే అంటున్నారు విశ్లేషకులు. ఇజ్రాయెల్ తరఫున అమెరికా ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనటమే కాకుండా ఏకంగా ఇరాన్ పై బాంబులతో దాడులు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో రష్యా రంగంలోకి దిగుతుందని ఆశించిన ఇరాన్ కు ఆశాభంగం అయ్యిందని అంటున్నారు.

అయితే యుద్ధంపై రష్యా వైఖరిపై వస్తున్న విమర్శలను ఖండించారు పుతిన్. రెచ్చగొట్టే వ్యాఖ్యలుగా అభివర్ణించారు. రష్యా ఎప్పటి నుంచో ఇరాన్ వెంటే ఉందని.. రష్యాలో దాదాపు 15 శాతం జనాభా ముస్లింలేనని తెలిపారు. గత చరిత్ర చూసినా.. అరబ్, ఇస్లామిక్ దేశాలతో రష్యాకు విడదీయరాని బంధం ఉందని తెలిపారు. ఇరాన్ ప్రజలకు మద్ధతుగా ఉండేందుకు, వారిని కాపాడేందుకు రష్యా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇక అమెరికా యుద్ధంలోకి దగటంపై రష్యా మండిపడింది. ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడిని తీవ్రంగా ఖండించింది. అమెరికా దాడులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది అన్యాయమని అధ్యక్షుడు పుతిన్ అన్నారు. మాస్కోలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాశ్చి తో సమావేశం సందర్భంగా అమెరికా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు, మద్ధతుగా నిలిచేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అనుపమ-కేంద్ర మంత్రి సురేష్ గోపి సినిమా విడుదలవ్వడం లేదు





**హైదరాబాద్ పెన్ పవర్:**నటుడు–రాజకీయ నాయకుడు సురేష్ గోపి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలలో నటించిన జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (%జీూఖ%) సినిమా విడుదలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (%జదీఖీజ%) తిరస్కరించడంతో సినిమా విడుదలను వాయిదా వేశారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ కోర్ట్ రూమ్ థ్రిల్లర్ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సి ఉంది. ఈ సినిమాని సెన్సార్ బోర్డు ప్రదర్శించడానికి నిరాకరించిందని, జూన్ 27న విడుదల లేదని చిత్ర యూనిట్ తెలిపింది.జానకి పేరును తొలగించాలని డిమాండ్ చేస్తూ %జదీఖీజ% సినిమా టైటిల్‌పై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. టైటిల్‌ను మార్చడం సరైనది కాదని పేర్కొంటూ నిర్మాతలు నిరాకరించారు. ఈ సినిమా ఇంతకుముందు సర్టిఫికేషన్ ఫార్మాలిటీలను పూర్తి చేసి, ఎటువంటి కోతలు లేకుండా %ఖ/ూ% 13ం రేటింగ్‌ను పొందినప్పటికీ, ఇప్పుడు దానికి పబ్లిక్ ఎగ్జిబిషన్‌కు అనుమతి నిరాకరించారు. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ దర్శకుడు ఉన్ని కృష్ణన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమాలో జానకి అనే పేరును ఉపయోగించరాదని సెన్సార్ బోర్డు ఈ చిత్ర నిర్మాతలకు స్పష్టంగా తెలియజేసినట్లు చెప్పారు. టైటిల్, పాత్ర పేరును మార్చాలని బోర్డు చిత్రబృందానికి సూచించినట్లు తెలిపారు.

## తెలంగాణలో జూన్ 26 వరకు వర్షాలు.. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 26 వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హైదరాబాద్ విభాగం అంచనా వేసింది. పిడుగులతో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. భద్రాద్రి, మహబూబాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ అదిలాబాద్, మంచిర్యాల, అసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబాబాద్, హైదరాబాద్, మేడ్చల్, నల్గొండ, నాగర్ కర్నూల్, సూర్యాపేట జిల్లాలలో పిడుగులతో కూడిన వర్షాలు పడే చాన్స్ ఉండటంతో ఆ జిల్లాల్లో వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ఎల్లో అలర్ట్ జారీ చేశారు. జూన్ 26 వరకు హైదరాబాద్ నగరంలో వర్షం లేదా ఈదురుగాలులతో కూడిన చినుకులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వాతావరణ శాఖ ఎటువంటి హెచ్చరిక జారీ చేయనప్పటికీ, సోమవారం నాడు నగరం మేఘావృతమై కనిపించింది.

## వామ్మో.. పెద్ద పులి తిరుగుతోంది!!



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పులి టెన్షన్ పెడుతోంది. బోథ్, సారంగాపూర్ మండలాల అడవుల్లో పులి సంచారం భయాందోళనలకు గురిచేసింది. అటవీ శాఖ ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరా ట్రాప్‌లో అది రికార్డ్ అయింది. అటవీ అధికారుల ప్రకారం, రెండు సంవత్సరాల వయస్సు గల పులి బోథ్ శివార్లలో కనిపించింది. ఆవాసం, ఆహారం కోసం పొరుగున ఉన్న మహారాష్ట్ర నుండి ఈ ప్రాంతంలోకి అది దారితప్పి వచ్చి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. త్వరలో దానిని పట్టుకుంటామని వెల్లడించారు. గత గురువారం బోథ్ అటవీ ప్రాంతంలో ఓ దూడపై పెద్దపులి దాడి చేసింది. పులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, సమీప గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. పులిని లోతైన అటవీ ప్రాంతాలలోకి మళ్లించడానికి, సురక్షితమైన ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# బెంగళూరులో మహిళకు పట్టపగలే లైంగిక వేధింపులు!




హైదరాబాద్ పెన్ పవర్:బెంగళూరు నగర శివార్లలో సభ్య సమాజం తలదించుకునే సంఘటన చోటుచేసుకుంది. పట్టపగలు, నడిరోడ్డుపై ఓ మహిళపై కొందరు దుండగులు లైంగిక వేధింపులకు పాల్పడి, దాడి చేసి, దుర్భాషలాడారు. ఈ అమానుష ఘటన ఆదివారం సీసీటీవీ కెమెరాలో రికార్డయింది.

వివరాల్లోకి వెళితే, బెంగళూరుకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలోని మైలసంద్ర సమీపంలోని రేణుకా యెల్లమ్మ లేఅవుట్‌లో నిన్న (జూన్ 22) సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు కిరాణా సామాను కొనేందుకు వెళ్తుండగా, కొందరు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. సీసీటీవీ ఫుటేజీలో దుండగులు ఆమెను వెంబడించడం, అసభ్యంగా తాకేందుకు ప్రయత్నించడం, మాట్లాడటానికి యత్నించడం స్పష్టంగా కనిపించింది. వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన మహిళపై ఓ వ్యక్తి చేయి చేసుకున్న దృశ్యాలు కూడా నమోదయ్యాయి.

దుండగుల వేధింపులను ప్రతిఘటించి, తనను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించినప్పుడు వారు ఆమెపై దాడి చేసినట్లు సమాచారం. ఆమె కూడా వారిని ఎదుర్కొనేందుకు ప్రయత్నించినట్లు వీడియోలో కనిపించింది. అనంతరం స్థానికులు, ఆమె స్నేహితుడు అక్కడికి చేరుకుని బాధితురాలిని రక్షించారు. అయితే, విచారకరంగా, వేధించిన వారిలో ఒకరిని కొట్టినందుకు గాను బాధితురాలి స్నేహితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే, నిందితులు మళ్లీ రెచ్చిపోయారు. బాధితురాలిని రక్షించిన స్థానికులపై దాడి చేసేందుకు ఆమె నివాస ప్రాంతానికి దూసుకెళ్లారు. ఓ నివాస సముదాయం గేటును తోసుకుని లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు మరో వీడియోలో రికార్డయ్యాయి.

"నిన్న నేను షాపుకు నడుచుకుంటూ వెళుతుండగా, కొంతమంది వ్యక్తులు రోడ్డు మధ్యలో గొడవపడుతూ కనిపించారు. నన్ను ఆపి, దుర్భాషలాడుతూ అసభ్యంగా తాకడం మొదలుపెట్టారు. వారు మద్యం మత్తులో ఉన్నారు, నాపై లైంగిక వేధింపులకు ప్రయత్నించారు. అప్పుడు స్థానికులు వచ్చి నాకు సహాయం చేశారు" అని బాధితురాలు మీడియాకు తెలిపారు. "నాకు సహాయం చేయడానికి వచ్చిన వారిని కూడా ఆ వ్యక్తులు కొట్టారు. నన్ను కూడా కొట్టారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దుండగుల బృందం గంజాయి, పెయింట్ థిన్నర్ మత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ఈ ఘటనపై బాధితురాలు బన్నేరుఘట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే ఉద్దేశ్యంతో దాడి లేదా నేరపూరిత బలప్రయోగానికి సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 74తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాధితురాలు తనకు సహాయం చేయమని తన స్నేహితుడిని పిలిచినట్లు తెలిసింది. అతను ఆమెను వేధించిన వారిలో ఒకరిపై దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయని పోలీసులు వెల్లడించారు. బాధితురాలి తరఫున పోరాడిన జిమ్ ట్రైనర్ అయిన ఆమె స్నేహితుడిని అరెస్ట్ చేయగా, మహిళను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

# రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన నారా లోకేశ్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతుల కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్మృతివనమైన ఎన్టీఆర్ ఘాట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని లోకేశ్ పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో రూ.1.35 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ ఘాట్‌లో మరమ్మతు పనులు చేపట్టడాన్ని ఆయన స్వాగతించారు. "తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదం, తెలుగు జాతి వెలుగు సంతకం, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మహానాయకుడు ఎన్టీఆర్ స్మృతివనం అయిన ఎన్టీఆర్ ఘాట్‌కు రూ.1.35 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ మరమ్మతులు చేపట్టడం చాలా సంతోషం. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులకు నిధులు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని నారా లోకేశ్ తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

# ఏమిటీ బి-2 బాంబర్ ప్రత్యేకత? వీటిని ఏసీ హ్యాంగర్లలోనే ఎందుకు ఉంచుతారు?



హైదరాబాద్ పెన్ పవర్:ఇరాన్ లోని ప్రముఖ అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేశాక బి-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన యుద్ధ విమానాలు ఇవే. అమెరికా వైమానిక దళం అమ్ములపొదిలోని అత్యంత కీలకమైన అస్త్రాల్లో బి-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ ఒకటి. దీని తయారీలో వాడిన ప్రత్యేకమైన సాంకేతికత, దీని నిర్వహణలో కూడా అంతే ప్రత్యేకమైన ఏర్పాట్లను కోరుతుంది. ముఖ్యంగా, ఈ విమానాలను భద్రపరిచే హ్యాంగర్లు సాధారణమైనవి కాకుండా, పూర్తిస్థాయి వాతావరణ నియంత్రణ వ్యవస్థలను కలిగి ఉండటం తప్పనిసరి. ఇంత ఖరీదైన, అత్యాధునిక యుద్ధ విమానాలకు ఎయిర్ కండిషన్డ్ హ్యాంగర్లు ఎందుకు అవసరమో వివరంగా చూద్దాం.

**స్టెల్త్ పూత పరిరక్షణ**

బి-2 స్పిరిట్ బాంబర్లకున్న ప్రధాన బలం శత్రు రాడార్లకు చిక్కకపోవడం. ఈ స్టెల్త్ సామర్థ్యం విమానంపై పూసిన ప్రత్యేకమైన రాడార్-గ్రహించే పదార్థాలపై (రాడార్ అబ్జార్బింగ్ మెటీరియల్స్) ఆధారపడి ఉంటుంది. ఈ పూతలు గాలిలో తేమ, ఉష్ణోగ్రత మార్పులు, మరియు ధూళి వంటి వాటికి చాలా సున్నితంగా ఉంటాయి. విమానం రాడార్లకు కనపడకుండా ఉండాలంటే, ఈ పూత దెబ్బతినకుండా కాపాడుకోవాలి. ఇందుకోసం, ఉష్ణోగ్రత మరియు తేమను నియంత్రించే క్లైమేట్-కంట్రోల్డ్ హ్యాంగర్లలో వీటిని నిల్వ చేస్తారు.

**తుప్పు పట్టకుండా నివారణ**

బి-2 విమానం నిర్మాణంలో ఉపయోగించే విశిష్టమైన మిశ్రమ లోహాలు (కాంపోజిట్ మెటీరియల్స్) నియంత్రణ లేని వాతావరణంలో ఉంచితే తేలికగా తుప్పు పట్టే అవకాశం ఉంది. ఎయిర్ కండిషన్డ్ హ్యాంగర్లు స్థిరమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా ఈ కీలకమైన పదార్థాలు నెమ్మదిగా క్షీణించకుండా నివారిస్తాయి.

**మిషన్ సంసిద్ధత**

సరైన నిల్వ పద్ధతులు పాటించకపోతే, ప్రతి ప్రయాణం తర్వాత విమానానికి విస్తృతమైన మరియు ఎక్కువ సమయం తీసుకునే నిర్వహణ అవసరమవుతుంది. ఈ ప్రత్యేక హ్యాంగర్లు విమానాలను ఎల్లప్పుడూ మిషన్‌కు సిద్ధంగా ఉంచడంలో సహాయపడతాయి. ప్రయాణాల మధ్య విమానం నిరుపయోగంగా ఉండే సమయాన్ని (డౌన్‌టైమ్) ఇవి తగ్గిస్తాయి.

**దీర్ఘకాలిక మన్నిక**

ఒక్కో బి-2 బాంబర్ విలువ సుమారు 2 బిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో సుమారు రూ.16,600 కోట్లు) ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన ఆస్తిని కాపాడుకోవడానికి అమెరికా వైమానిక దళం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ వాతావరణ నియంత్రిత హ్యాంగర్లు, విమానంలోని సంక్లిష్టమైన వ్యవస్థలను మరియు సున్నితమైన ఉపరితలాలను కాపాడటం ద్వారా బాంబర్ల కార్యాచరణ జీవితకాలాన్ని పొడిగిస్తాయి.

సాధారణ హ్యాంగర్లు ఎందుకు సరిపోవు?

సాంప్రదాయ హ్యాంగర్లలో అవసరమైన పర్యావరణ నియంత్రణలు మరియు గాలిని శుద్ధి చేసే వ్యవస్థలు (ఎయిర్ ఫిల్ట్రేషన్ సిస్టమ్స్) ఉండవు. గాలిలో తేమలో స్వల్ప మార్పులు కూడా స్టెల్త్ పూతలో లోపాలను బహిర్గతం చేసి, విమానం రాడార్లను ఏమార్చే (లో అబ్జర్వబిలిటీ) సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

**వ్యూహాత్మక ప్రదేశాలు**

ప్రపంచవ్యాప్తంగా కొన్ని ఎంపిక చేసిన వైమానిక స్థావరాలను మాత్రమే ఈ ప్రత్యేక బి-2 హ్యాంగర్లతో నవీకరించారు. ఈ సదుపాయాలు కేవలం అత్యాధునిక వాతావరణ నియంత్రణనే కాకుండా, వేగవంతమైన నిర్వహణ మరియు మిషన్ తయారీకి అవసరమైన విద్యుత్ సరఫరాలు మరియు పరికరాలను కూడా కలిగి ఉంటాయి.

## చాలా పెద్ద తప్పు చేసింది.. మూల్యం చెల్లించుకోక తప్పదు: ఇరాన్ మూల్యం చెల్లించుకోక తప్పదు



ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్, అమెరికాకు తప్పకుండా బుద్ధి చెబుతామని, ప్రతిస్పందన ఖచ్చితంగా ఉంటుందని హెచ్చరించారు. మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడికి ఇరాన్ సుప్రీం నాయకుడు ఖండించారు.

ఆదివారం నాడు ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రం, మరో రెండు ప్రదేశాల పైన అమెరికా 30,000 పౌండ్ల బంకర్-బస్టర్ బాంబులను జారవిడిచింది. అమెరికా దురాక్రమణకు ప్రతిస్పందనకు జవాబు ఉంటుందని ఇరాన్ ప్రతిజ్ఞ చేసింది. తమ ప్రతిస్పందనను స్వీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ అన్నారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌పై జరిగిన అత్యంత తీవ్రమైన పాశ్చాత్య సైనిక చర్య ఈ దాడులని ఇరాన్ చెబుతోంది.

# ఎన్నికల వేళ ఫోన్ల ట్యాపింగ్: సిట్ చేతికి కీలక ఆధారాలు, వెలుగులోకి విస్తుపోయే నిజాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు పురోగమిస్తున్న కొద్దీ దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో జరిగిన పలు ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసి, సమాచారం సేకరించి, కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అప్పటి ఉన్నతాధికారుల పాత్రపై కూడా సిట్ దృష్టి సారించింది.

సమాచారం ప్రకారం, 2018 నాటి సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అప్పటి ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన ప్రణీత్ రావు, ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వ్యవహరించిన రాధాకిషన్‌రావుకు చేరవేసేవారని తెలుస్తోంది. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగి, ఈ ఆపరేషన్లు నిర్వహించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే, హైదరాబాద్‌లోని ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్‌ప్రసాద్ అనే వ్యక్తికి చెందిన రూ.70 లక్షల నగదును ఫోన్ ట్యాపింగ్ ద్వారా పొందిన సమాచారంతోనే టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారని వార్తలు వస్తున్నాయి.

అదేవిధంగా, తీవ్ర ఉత్కంఠ రేపిన దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రఘునందన్‌రావు బంధువులకు చెందిన సుమారు కోటి రూపాయల నగదును కూడా ట్యాపింగ్ సమాచారం ఆధారంగానే స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డీసీపీ రాధాకిషన్‌రావు, ఆయన బృందం ఈ మొత్తాన్ని సీజ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైన మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఇదే తరహాలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్‌కు సమాచారం అందింది. నల్గొండ జిల్లాకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకుల అనుచరుల నుంచి సుమారు మూడున్నర కోట్ల రూపాయల నగదును కూడా అక్రమ నిఘా ద్వారా పొందిన సమాచారంతోనే అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది.

## బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు...

# తీవ్రంగా స్పందించిన రాజాసింగ్

- **కాళేశ్వరంపై ఇవిగో ఆధారాలు అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు**
- **బండి సంజయ్ పై బీఆర్ఎస్ నేతల విమర్శలు**
- **బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండించిన రాజాసింగ్**
- **కాళేశ్వరం కచ్చితంగా అవినీతి ప్రాజెక్టేనని రాజాసింగ్ స్పష్టం**
- **బీఆర్ఎస్ కాళేశ్వరాన్ని ఏటీఎంలా వాడుకుందన్న మోదీ వ్యాఖ్యలు వాస్తవమేనని వెల్లడి**
- **ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచారని తీవ్ర విమర్శలు**

హైదరాబాద్ పెన్ పవర్:కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతి గురించి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా వివరాలు వెల్లడించగానే, బీఆర్ఎస్ నాయకులు అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నూటికి నూరు శాతం అవినీతిమయమైన ప్రాజెక్టేనని ఆయన పునరుద్ఘాటించారు.

"కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మా పార్టీది, మా అందరిదీ ఒకే మాట. ఈ ప్రాజెక్టు అవినీతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గతంలో చేసిన వ్యాఖ్యలకే మేము కట్టుబడి ఉన్నాం" అని రాజాసింగ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల తీరు చూస్తుంటే 'దొంగే దొంగ అన్నట్లుగా' ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రధాని మోదీ చెప్పినట్లుగా, బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును తమ ఏటీఎంగా మార్చుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. "కేవలం రూ.8 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టును రీడిజైనింగ్ పేరుతో ఏకంగా రూ.1.20 లక్షల కోట్లకు పెంచిన మాట వాస్తవం కాదా?" అని నిలదీశారు.అప్పట్లో కేసీఆర్ తనకు తానే ఇంజినీర్‌గా ప్రకటించుకుని కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. ఇప్పుడు ఆయన కుమారుడు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) కంటే తానే గొప్ప మేధావి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం బీఆర్ఎస్ నేతల ఓటమికి నిదర్శనమని ఆయన అన్నారు.



## కవితతో వేదిక పంచుకున్న ఆర్.కృష్ణయ్యకు

# మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**బీసీ బిల్లు అంశానికి రాజకీయ రంగు పులుముతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బీసీల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని కవిత, ఇప్పుడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

తమ ప్రభుత్వం బీసీ బిల్లును శాసనసభలో ఆమోదింపజేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తక్కువ చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.

ఇదే సందర్భంలో, బీసీ రిజర్వేషన్ల కోసం కవిత చేపట్టిన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరిన ఎంపీ ఆర్. కృష్ణయ్య వైఖరిపైనా మంత్రి స్పందించారు. "బలహీన వర్గాల కోసం విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసిన పెద్దన్న ఆర్. కృష్ణయ్య అంటే మా అందరికీ ఎంతో గౌరవం ఉంది. అయితే, పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఎలాంటి మేలు చేయని కవిత వంటి వారితో వేదిక పంచుకుని మీ గౌరవాన్ని తగ్గించుకోవద్దు" అని కృష్ణయ్యకు హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వానికి బీసీ బిల్లును పంపామని, దాని ఆమోదం కోసం ఆర్. కృష్ణయ్య చొరవ తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. అవసరమైతే అందరం కలిసి ప్రధానిని కలుద్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించారు.